# మని + షి = భార్య

"మాధవీ... కాఫీ పెట్టేవా? — కాళ్ళకున్న చెప్పులు విడవకుండానే గావుకేక పెట్టాడు. అప్పుడే ఆఫీసు నుండి ఇంట్లోకి అడుగుపెట్టిన మూర్తి.

"ఏమిటా తొందర? ... వస్తూ హోటల్లో తాగి రాకపోయారా..." స్టౌ వెలిగిస్తున్న మాధవి జవాబుగా అంది రుసరుస లాడుతూ.

మూర్తి కంటే మరో ఐదు నిముషాలు ముందుగా ఇల్లు చేరుకుంది మాధవి. రాగానే... కట్టుకున్న చీరైనా మార్చుకోలేదు. అగ్గిపెట్టె చేతిలోకి తీసుకుని కాఫీ పనే ప్రారంభించింది. తనకూ తలనొప్పిగా వుంది. వుస్సురోమని ఇల్లు చేరుకుంది.

కాసిని కాఫీ నీళ్ళు గొంతులో పోసుకుంటేగాని... ప్రాణానికి త్రాణవచ్చి తలనొప్పి తగ్గేట్టు లేదు.

బట్టలు మార్చుకుంటూ "ఏమిటింకా ఆలస్యం - నువ్వు కాఫీ ఇచ్చేసరికి చీకటి పడేట్టుంది ..." మరోసారి అడిగేడు మూర్తి.

"ఎందుకలా విసుక్కుంటారూ! నేనూ మీకుమల్లే ప్రొద్దుననగా ఇల్లు విడిచివెళ్ళి ఇప్పుడే వచ్చాను ఆఫీసునుంచి. ఇంటికి రాగానే అన్నీ నేనే చూసుకోవాలాయె. పెద్ద దిక్కు వుండీ వుపయోగంలేదు. నాకొకరు చేసిపెట్టే అదృష్టమూ లేదు..." అత్తగారు ఎప్పుడూ పెద్దకొడుకు ఇంటినే అంటిపెట్టుకుందనే భావం మాధవి మాటల్లో స్పష్టమైంది.

"సరే...సరే... నీ వుపన్యాసాల కేమొచ్చె గానీ... ముందు కాఫీ పట్రా..."

"మీరు నన్ను తొందరపెట్టి లాభంలేదు. డికాక్షన్ అయిపోవటంతో నీళ్ళు పెట్టాను. అవి కాగితేగాని...పొడివేసి దించేందుకు వీల్లేదు. అయినా ఎన్నిసార్లు మొత్తుకున్నా విన్పించుకోరు... ఇలాంటి అర్జంటు సమయాల్లో 'బ్రూ' వుంటే ఎంత బావుంటుందీ? "

"ఖర్చు తగ్గించి పొదుపుచేయాలని నేను అనుకుంటుంటే నువ్వేమో...బ్రూ కొనాలంటూ బడ్జెట్ పెంచే ప్రయత్నం చేసి లాభంలేదు" ఇంటికి తెచ్చుకున్న ఫైళ్ళు సావధానంగా చూస్తూ అన్నాడు మూర్తి.

"మధ్యాహ్నం టిఫినూ, కేంటీన్లో రెండుసార్లు కాఫీ సేవించే మీకే ఇంత తొందరైతే ఆఫీసులో కటిక మంచినీళ్ళు తప్పించి మరోటి ముట్టుకోని నాకేమిటి?..."

"అబ్బబ్బ... వుద్యోగం వెలగబెట్టే ఆడవాళ్ళతో మాట్లాడలేం...అయిన దానికీ కాని దానికీ ఆర్గ్యూ చేస్తారు."

మిమ్మల్నేమీ కించపర్చటంలేదు లెండి. నా బాధేదో వెళ్ళబోసుకుంటున్నాను... అంటూ తెచ్చిన కాఫీకప్పు చేతికి అందించింది,

వేడివేడి కాఫీ సిప్ చేస్తూ... మధ్య మధ్య సిగరెట్ పీలుస్తూ..."మీకీరోజే జీతాలిచ్చేశారా?" అడిగేడు మూర్తి.

"ఓ" అంటూ కనుబొమలు ఎగరేసిన మాధవి "మీ రింకా అందుకోలేదేమిటీ?" అనే ధోరణిలో భర్త కళ్ళలోకి చూసింది.

"ఈరోజు మా డ్రాఫ్టు క్యాష్ కాలేదు. రేపు ఆదివారం. ఇక ఎట్లాగూ ఎల్లుండే మాకు జీతాలు..." నిరుత్సాహంగా చెప్పేడు.

"అయితే మేమే నయం" అనేసి కాఫీకప్పు తీసుకెళ్ళింది ఇంట్లోకి.

జీతం వచ్చిందని చెప్పిందే కాని...ఎంతొచ్చిందీ చెప్పనే లేదు. తెచ్చిన జీతం తన చేతికి అందించకుండా... వంటింట్లోపని చేసుకుంటుందేమిటీ? అడిగినా ఇవ్వకూడదని ఉద్దేశ్యమా? ... అయినా ప్రతి నెలా తాను అడగాలా...ఇంట్లోకి అడుగు పెట్టీ

పెట్టకుండా "ఇదిగోనండీ నా జీతం" అనేసి జీతం మొత్తం తన చేతికి అందిస్తే ఎంత హాపీగా వుంటుంది? మూర్తిలో వున్న మగబుద్ధి ఇంకా ఎన్ని రకాలుగానో ఆలోచిస్తోంది.

"ఏమండీ మీరోసారి లోపలికి రండి" బెడ్‌రూంలోంచి కేకేసింది మాధవి.

ఓహో తాను తీసుకొచ్చి ఇవ్వటం నామోషి కాబోలు దగ్గరకు పిలిపించుకుని ఇస్తే ఆమెగారికేమైనా క్రెడిటా? ఆడ బుద్ధి పోనిచ్చుకుంది గాదు అనేసి తలపోస్తూ బెడ్‌రూములోకి జొరబడ్డాడు.

"ఏమండీ!... నాలుగో తారీకున మా లేడీ టైపిస్టు అనూరాధ పెళ్ళి...ఇదిగో ఇన్విటేషను" కార్డు చూపించింది మాధవి.

జీతం ఇవ్వటానికి పిల్చిందేమోనని అనుకుని వస్తే... వెడ్డింగ్ కార్డు చేతికిస్తుందేమిటి వుడికిస్తోందా— లేక...ఓర్పును పరీక్షిస్తోందా?

అనూరాధ పెళ్ళయితే తనకేం?... ఆదిలక్ష్మమ్మ నీళ్ళోసుకుంటే తనకేం? ఇంతకూ... పెళ్ళి సంగతి ఇంట్లోకి పిలిచలా ఎందుకు చెప్తున్నట్టూ...

ఇంతలో ఇద్దరు పిల్లలూ పరుగెత్తుకుంటూ వచ్చి సంచీలు స్టాండుకు తగిలించి "మమ్మీ!— డాడీ—!" అంటూ మాధవినీ... మూర్తినీ చుట్టుకున్నారు.

"నాదగ్గరేం లేదర్రా!...మీ అమ్మకు ఈరోజే జీతం

వచ్చేసింది...అంచేత...మీ నోళ్ళేమైనా మీ మమ్మీ తీపి చేస్తుందేమో అడగండి..."

భర్తకి చెప్పకుండా పదిపైసలైనా ఖర్చు పెట్టేందుకు సాహసించని మాధవి...మూర్తి మాటలకు చిన్నబుచ్చుకుంది.

"మీరు డ్రెస్ విప్పేయండి. స్నానం చేసేక డాడీతో పిక్చరుకెళదాం..." మాట మార్చే ధోరణిలో అంది మాధవి.

వాట్ ఎ హెల్?—పిక్చరుకా?— ఫామిలీతోనా ... బాప్ రే...పదిరూపాయలు టిక్కెట్లకూ, మరో ఐదురూపాయలు ఆటోకి... వేస్ట్!—షీర్ వేస్ట్!...

అదిసరే...జీతం డబ్బులు తనకివ్వకుండా సినిమాలూ... కాకరకాయలూ అనేసి కబుర్లు చెప్తుందేమిటి?...

ఆఁ! అర్థమైంది. నోరు తెరిచి ఇస్తావా లేదా అనేసి అడిగేవరకూ ఇవ్వదల్చుకోలేదన్నమాట. నో! ఆమె అంతట ఆమె ఇచ్చేవరకూ తనూ అడగదల్చుకోలేదు.

అవునూ...తీరా...తను అడగలేదు గదాని... ఆమె కూడా వూరుకుంటే...?

ఏడు కొట్టేసరికి 'క్రిస్టల్' బార్‌లో కల్సుకుంటానని ఫ్రెండ్సుకి ప్రామిస్ చేశాడు—అంచేత...ఇప్పుడు డబ్బు అవసరం తనది—అడక్క తప్పదనిపించింది.

*　　　*　　　*

'బ్రూ' కొనాలంటే ఎకానమీ!... మాధవి ఫ్రెండ్ మేరేజికి పదిరూపాయలు స్పేర్ చేయటం అనవసరం... ఫామి

లీతో సినిమాకి వెళ్ళటం దుబారా...

కానీ...మూర్ఖంగా ఒకటో తారీకున...అందునా భార్య జీతం...ఫ్రెండ్సుతో బార్ కి వెళ్ళటం!... సివిలిజేషన్ !!

రెండు రౌండ్లు పూర్తి అయ్యాయి. మూర్తి కళ్ళు మూతలు పడనారంభించాయి. మాటలు తడబడుతున్నాయ్.

నలుగురూ కలిసి మొత్తానికి ఫుల్ బాటిల్ పూడ్చేశారు!

పదకొండు కొట్టింది—అంతా వెళ్ళిపోయారు.

అయోమయ స్థితిలో... ఆటోలో ఇల్లు చేరుకున్నాడు మూర్తి.

మాధవి తలుపు తీసింది-అంతేకాదు తూలిపడబోతున్న భర్తకు చేయూతిచ్చింది. బెడ్ మీద వాలిపోయింతర్వాత బూట్లువిప్పింది. సతీసావిత్రిలాగ భర్తకి సపర్యలన్నీ చేసింది.

తన సంస్కారానికీ... భర్త సభ్యతకూ వున్న తేడాను బేరీజు వేయటం మాధవి మనస్తత్వం కానేకాదు.

ఎంత చదువుకున్నా... భర్తతోపాటు సమానంగా వుద్యోగంచేసి సంపాదిస్తున్నా ... ఆడది ఆడదే— ఒక మగ వాడికి భార్య! — అని సర్దుకుబోయే స్వభావం.

అందుకే... భర్త అలవాట్లూ ఖర్చులూ క్షమించుతున్నా... ఎందుకూ? — ఏమిటీ? ... అనేసి అడగలేక పోతూంది. అది మాధవి బలహీనతేనేమో!

*    *    *

సిటీ బస్సు టికెక్కట్టుకి తప్ప మాధవి పర్సులో డబ్బేమీ వుండదు — మూర్తి అనుమతి లేకుండా ఒక్క పైసా కూడా ఖర్చుచేయకూడదు. అది రూలు.

పదిపైసలు పెట్టి పూలుకొన్నా... పావలాపెట్టి రిబ్బను కొనాలన్నా భర్త అనుమతి కావాలి!

ఒక్కొక్కప్పుడు తనకూ అన్పిస్తుంది ఏమిటీ జీవితం అనేసి—తానెవ్వరి కోసం సంపాదించాలి? — అసలు వుద్యోగం చెయ్యకపోతేనేం?

సంపాదిస్తున్నా ... కనీసపు అవసరాలు తీరటం లేదు.

అందరిలాగ పూటకో చీర కట్టుకోవాలని, భర్తతో సరదాగా షాపింగ్ కెళ్ళాలనీ... సినిమాలు చూడాలనీ అనుకోవటం తప్పా?

అటు ఆఫీసులో పనితో... ఇటు ఇంట్లో చాకిరితో... శరీరానికి మనస్సుకి సుఖం దూరమౌతోంది.

భర్తతోపాటు వుద్యోగం చేస్తే కావలసినంత డబ్బు చేతిలో వుంటుందనీ ...... హాయిగా సుఖంగా బ్రతుకు వెళ్ళదీయచ్చనీ అనుకుంది. ఇంకా ఏవేవో వూహించుకుంది.

వుద్యోగమైతే చేయగలుగుతోందిగాని తాను ఆశించిన దానికి భిన్నంగా జీవితం యాంత్రికంగా తయారైంది.

ఒకరోజున...

ఇంట్లో పని పూర్తిచేసుకుని ఆఫీసుకు బయలుదేరేసరికి పదిగంటలయింది. ఆఫీసువేళ దాటిపోతోంది.

సిటీ బస్‌లో వెడితే అటెండెన్సు రిజిస్టర్లో రెడ్ మార్కు పడ్తుంది. అంచేత రానూపోనూ సిటీబస్సు ఛార్జీ పెట్టి ఆటోలో వెళ్ళటం తప్పనిసరైంది.

ఆ కారణంగా ఆఫీసువదిలేక కాలినడకనే ఇల్లు చేరుకోవాల్సి వచ్చింది.

ఇల్లు చేరుకునేసరికి ఆరు దాటింది.

"ఏమిటె మాధవీ అలా వున్నావ్?..." మూర్తి వాకిట్లోనే ఎదురై అడిగేడు. అది పరామర్శ గాదు. వేళకు ఇల్లు చేరుకోనందుకు సంజాయిషీ అడిగినట్టుంది.

రెండు మైళ్ళు నడిచి ఇల్లు చేరుకునే సరికి .. సమాధానం కూడా చెప్పలేనంత నీరసంగా వుంది మాధవి.

"అందరికీ ఆఫీసు ఐదు గంటల వరకే అయితే... మీ ఆఫీసు చీకటిపడేవరకూ వుంటుందా?" వెటకారం ధ్వనించింది మూర్తి మాటల్లో.

ఆ మాటలు మాధవి గుండెలో ముళ్ళులా గుచ్చుకున్నయ్.

అయ్యో... అలిసిపోయి ఇంటికొచ్చిందిగదాని తనకో అరకప్పు కాఫీ అందిస్తే తప్పా? ఏం? ప్రతిరోజూ ఆ పని తాను చేయటంలేదూ! ఒక్క పూటైనా భర్త తనను ఆదరించి ప్రేమతో పరామర్శిస్తే ఏం పోతుందీ?

మాధవికి నాలుక తడి ఆరిపోతోంది. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పంచలోవున్న వాలు కుర్చీలో వాలిపోయింది.

"రాణీ గారు ఆఫీసు నుండి ఆలస్యంగా రావటమే కాకుండా... వాలుకుర్చీలో రెస్టు తీసుకుంటే... ఇంట్లో చాకిరీ ఎవరు చేస్తారూ?..." కష్టపడి వచ్చిందిగదాని సానుభూతైనా చూపకపోగా ఎత్తిపొడుపుగా అన్నాడు మూర్తి.

ఏం మనిషి.... ఎదుటివారి పరిస్థితి బొత్తిగా గ్రహించరు చస్తున్నా చాకిరీ చేయాల్సిందే!... వెధవ చాకిరీ ఎప్పుడూ వుండేదేగా... అని అనుకోలేదు మాధవి.

అనవసరమైన ప్రశ్నలతో మరింత విసిగించకుండా ఒక్క గ్లాసెడు మంచినీళ్ళయినా భర్త ఇస్తే బావుండు అని మాత్రమే అనుకుంది.

"నువ్వట్లా రెస్టుతీసుకో... నేనూ పిల్లలూ ఈ పూటకి హోటల్లో భోజనంచేసి వస్తాం..." అనేసి హుషారుగా బైటికెళ్ళిపోయాడు మూర్తి.

తానేమైనా బాధ లేదు. తన పరిస్థితేమిటని ఎవ్వరికీ అక్కరలేదు. ఎవరి సుఖం వారిది అని అనుకుంది.

* * *

ఆరోజు ఆదివారం కావటంతో మూర్తి పదిగంటలకల్లా భోజనం ముగించి క్లబ్బు కెళ్ళేడు.

పిల్లలిద్దర్నీ వెంటపెట్టుకుని సరోజను కలుసుకుందుకు బయల్దేరింది మాధవి.

సరోజ మాధవీ కాలేజీమేట్సు. హాస్టల్ మేట్సుకూడా!

చదువు అయిపోయింతర్వాత అప్పుడప్పుడు వుత్తరాలు వ్రాసుకోవటం తప్పించి మళ్ళీ కలుసుకోనైనాలేదు.

ఆరునెల్ల క్రితం వెడ్డింగ్ కార్డు పంపుతూ పెళ్ళికితప్పకుండా రమ్మని వ్రాసింది. కానీ తాను వెళ్ళలేకపోయింది.

తానీవూరొస్తున్నట్టూ తప్పక కలుసుకోమంటూ ఆప్యాయంగా బాబు వ్రాసింది.

సరిగా ఇంటి ముందే రిక్షా ఆపేడు.

వాకిట్లోకి ఎదురై మాధవిని కౌగిట్లో ఇముడ్చుకుంది సరోజ.

పిల్లలిద్దరినీ చూస్తూ "నీ కుమార రత్నాలన్నమాట!.. పిల్లలు ముద్దొస్తున్నారే...! అదిసరే...నువ్వేమిటీ పీనుగులా తయారయ్యావ్? మొగుడూ పెళ్ళాం ఇద్దరూ సంపాదించు కుంటున్నారు గదా...మనిషి వెంతో మారిపోయి వుంటావనుకు న్నాను..." మాధవిని జవాబైనా చెప్పనీకుండా ప్రశ్నలతో వుక్కిరిబిక్కిరి చేసింది సరోజ.

"నీ మాటల ధోరణి మాత్రం ఏమీ మారలేదే సరూ.. అనేసి ఇద్దరూ ఇంట్లోకి నడిచారు.

మాధవిని డ్రాయింగ్ రూములో కూర్చోబెట్టి ఇంట్లో కెళ్ళింది సరోజ.

ఇంటిముందు లాన్సు.... గార్డెన్లో ఫౌంటెన్... రకరకాల పూల మొక్కలూ...ఇంటినిండా నౌకర్లూ... బాగా కలవారి ఇల్లులా వుంది.

టీపాయ్ మీదుండే మేగజైన్సు తిరిగేస్తోంది మాధవి.

"ఆఁ! ఇప్పుడు చెప్పవే... విశేషాలూ ..." అనేసి డ్రింక్ అందించింది.

"సారీ సరోజా... నీ మేరేజ్‌కి రాలేకపోయాను" ముక్తసరిగా అంది.

"నువ్వు తప్పక వస్తావనే అనుకున్నాను. కానీ... డిజప్పాయింటయ్యాను..."

"నీకేం లేవే!... ఐ. పి. యస్. ఆఫీసరు భార్యవి— మంచి హోదా ... అందుకు తగిన అంతస్తూ... లేట్ మేరేజన్న మాటేగానీ... చదువుకునే రోజుల్లో నువ్వు కన్నకలలు అక్షరాలా ఫలించాయి."

"ఏమే జలసీగా వుందా నీకు? సిల్లీగరల్, సారీ... వుమన్ ..."

ఇద్దరూ నవ్వుకున్నారు.

పైకి నవ్వుతూ మాట్లాడుతున్నప్పటికీ... మాధవి ముఖంలో... మాటల్లో అసంతృప్తేదో వున్నట్టు పసికట్టింది సరోజ.

"నీకు మాత్రమేమే? ... ఇద్దరూ సంపాదించుకుంటున్నారు. రత్నాల్లాంటి యిద్దరు పిల్లలూ ... మాట్లాడవేమే మొద్దూ?..."

అప్రయత్నంగా మాధవి కళ్లు చెమ్మగిల్లాయి.

"అన్నీ వున్నా... ఏమీ లేనిదాన్ని ... అందరూ వున్నా... ఎవ్వరూ లేనిదాన్ని ..." మాధవి కంఠం జీరవోయింది.

"మాధవీ...వుద్యోగం చేస్తున్నా...నేత చీరలే కడు

తున్నా వేంటే?...డబ్బంతా దాచి పెడ్తున్నావన్నమాట... అవునా?—"

"సరూ చదువుకునే రోజుల్లో తెలిసీ తెలియని బ్రతుకు గొప్ప వూహించుకున్నాం. కలలుకన్నాం. తీరా...ఆచరణలోకి వస్తే కొందరి వూహలు ఎండమావుల్లాగా వుంటయ్..." నిర్లిప్తంగా అంది మాధవి.

"నీ పిచ్చిమాటల కేమొచ్చింది గాని... నీ కొచ్చిన బాధేమిటో చెప్పరాదూ?— నా దగ్గర దాస్తావేం ?" లాలనగా అడిగింది.

"నీతో కాక మరెవ్వరితో చెప్పుకోనే ... వుద్యోగం చేస్తున్నా...ఏ విధమైన మనశ్శాంతినీ...తృప్తినీ మిగుల్చుకోలేకపోతున్నాను... ఆః నా దురదృష్టం!..."

"ఎందుకనీ—"

"ఇటు ఇంట్లో చాకిరీ...అటు ఆఫీసులోపనీ... బ్రతుకు నరకయాతనగా వుంది. సంపాదిస్తున్నానన్న మాటే గాని ... స్వతంత్రించి ఒక్క పైసాకూడా ఖర్చు పెట్టుకుందుకు వీల్లేదు.

"ఓసి సత్తెకాలపు మనిషీ. ఈ అణుయుగంలోకూడా... ఇంకా నీ వంటి సీతాసావిత్రులున్నారంటే నాకు ఆశ్చర్యంగా వుంది—ఇద్దరూ సంపాదిస్తున్నప్పుడు సరిసమానంగా ఖర్చు పెట్టుకునే హక్కు ఇద్దరికీ వుంది—అవునా ?"

"అని నువ్వంటావ్—కానీ...ఆయన మాటకు ఎదురు చెప్పే శక్తి నాకులేదు..."

"పరిస్థితులను ఎదిరించలేనప్పుడు...మనం కుళ్ళిచావటం తప్ప...వేరే గత్యంతరం లేదనుకోవటం కేవలం వెర్రితనం. నీ చాదస్తపు మాటలతో చేజేతులా జీవితాన్ని నరకం చేసుకోకు... స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని కాదనుకుని బానిసగా బ్రతుకుతున్నావా?— షేమ్!! దేశం పురోగమిస్తోంది బట్... ఐ రియల్లీ పిటీ యూ."

"మొన్న మా అక్క కూతురి బారసాలకని వెండి వుగ్గు గిన్నె కొందామని పాతిక రూపాయలడిగేను. ససేమిరా లేవన్నారు. అదలా వుంచు. బర్త్‌డేకి చీర కొనమన్నాను. కొత్త చీరెందుకూ డబ్బు దండగన్నారు —కానీ వారుమాత్రం వారి విలాసాలకు డబ్బు ఖర్చు పెడుతూనే వుంటారు..." బావురుమంది మాధవి పసిపిల్లలాగా.

"డోన్ట్ బీ సిల్లీ. నువు నిజంగా పిరికిదానివి. ఏడుపు తప్ప నీకు మరోటి చేతైనట్టులేదు. కానీ...పరిస్థితులను ఎదిరించటం నేర్చుకో!- అంతమాత్రం చేత నీ భర్తను ఎదురించి అగౌరవ పరచమని నేనను—నీ పట్ల సానుభూతి చూపని వ్యక్తి ఎవరైనా సరే... చివరికి తాళికట్టిన భర్త అయినా సరే ... నువ్వు అతిగా గౌరవించవద్దు. అర్థమైందా?"

చిన్ననాటి ముచ్చట్లూ ... సంసారంలో కష్టసుఖాల గురించి మాట్లాడుకుంటుంటే...గంటలు నిముషాల్లా దొర్లి పోతున్నాయ్.

అప్పటిదాకా ఇల్లంతా తిరిగి ఆడుకుంటున్న పిల్లలిద్దరూ

మాధవి దగ్గరకొచ్చి ఇంటికెడదామని మూరాం మొదలు పెట్టారు.

"వస్తా సరూ! వారింటికొచ్చే వేళయింది..." లేచి నిల్చుంది మాధవి.

"ఆఁ- ఎం వస్తే?... నువ్వు లేకపోవటంచూచి ఆయనే కాఫీ పెట్టుకుని తాగుతార్లే. భయపడ్తుంటే... మరింత బెదిరించాలని చూస్తారు మగాళ్లు...సారీ మొగుళ్ళు! —" ఇద్దరూ నవ్వుకున్నారు.

"వేళగాని వేళలో తీరుబడిగా రాణిగారు బెడ్ మీద పడుకుని పుస్తకం చదువుకుంటున్నారేమిటీ? — ఆఫీసుకు శలవు పెట్టారా? ఇంట్లోకి అడుగు పెట్టగానే అడిగేడు ఆశ్చర్యంగా.

"వెళ్ళేను! వచ్చేశాను". ముక్తసరిగా అంది మాధవి.

"ఏం వంట్లో బాగోలేదా?" విసురుగా అడిగాడు.

"ఈ ఇంట్లో నాబాగోగులు ఎవరిక్కావాల్లెండి?..." తనను తాను నిందించుకుంటూ అంది జవాబుగా.

"ఏమిటా ఎత్తిపొడుపు మాటలు?..." నొసలు చిట్లించి విసుగు వ్యక్తం చేశాడు.

"అది సరే... మీరూ వచ్చేశారేం? ..."

"క్రికెట్ మాచ్ చూచేందుకని మధ్యాహ్నం నుంచీ పర్మిషన్ పెట్టాను. తీరా వెడితే టిక్కెట్టు దొరకలేదు. మళ్ళీ ఆఫీసుకెళ్ళేందుకు మనస్కరించక ఇలావచ్చేశాను..." బట్టలు మార్చుకుంటూ చెప్పేడు మూర్తి.

"అదృష్టవంతులు. మీ కేం మగవారు ... ఎటొచ్చీ బాధలన్నీ మా కేగా? ..."

"ఇప్పుడు నీ కొచ్చిన బాధేమిటో ..." నిర్లక్ష్యంగా అడిగాడు.

"నేను వుద్యోగం చెయ్యతల్చుకోలేదు. చెయ్యలేను" బెడ్ మీదనుంచి లేచి కూర్చుంటూ చెప్పేసింది.

ఆమాట వినేసరికి మూర్తి స్థంభించిపోయాడు. మనిషిలో ఏవిధమైన చలనమూ కన్పించలేదు.

"మానేస్తావా? — ఎందుకనీ? ..." మూర్తి గొంతులోంచి పెకుల్చుకుని వచ్చాయి ప్రశ్నలు.

"ఎందుకంటే... ఏం చెప్పమంటారు .... చాకిరీ చేస్తూ ఇటు ఇంట్లో మీచేతా... అటు ఆఫీసులో అడ్డమైన వాళ్ళచేత మాటలు పడలేను...."

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటం లేదు" నిశితంగా మాధవి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"మీకెలా అర్థమౌతుంది — నా ఖర్మ..." కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"అసలు విషయమేమిటో చెప్పకుండా.... ఏడుపు? ..." సంగతేమిటో తెల్సుకుందామనే ఆదుర్దాకన్నా... వుద్యోగం మానుకోబోతోందనే బాధద్యోతకమైంది మూర్తి మాటల్లో.

"ఆడదానికెందుకీ వుద్యోగం చెప్పండీ ..."

"వద్దు మాధవీ. నువ్వు వుద్యోగం మానుకోవద్దు. ప్లీజ్" నిజంగా వుద్యోగం మానేస్తే... కుటుంబ భారమంతా తన నెత్తిమీదే పడుతుంది. తన అలవాట్లకీ... ఇంటి ఖర్చుకి డబ్బు సరిపోదు. మూర్తి మనసులో భయం ప్రవేశించింది. మనిషిలో వణుకు బయల్దేరింది. ముఖమంతా చెమటతో తడసి పోయింది.

"అసలేం జరిగిందీ...." నూతిలోంచి మాట్లాడినట్టుంది మూర్తి కంఠం.

"కొత్తగా చేరిన యల్డీసీ... ప్రతిరోజూ నన్ను చూచి వికవికలూ ... పకపకలూ, మనిషి పొగరుబోతు— పెద్దా చిన్నా లేకుండా... ఎంతమాటబడితే అంతమాట అనేస్తున్నాడు. ఒకసారి మొదట్లో వార్నింగిచ్చాను— రానురాను వాడి వ్యవహారం శృతిమించుతోంది — అయినా ... నాకెందుకండీ వుద్యోగం... మీరు సంపాదిస్తుంటే తిని కూర్చోక"

"రాస్కెల్సు! అయినా ఎవడో ఏదో వాగేడని నువ్వు వుద్యోగం మానేయటం అవివేకం... ఆఫీసుల్లో అలాంటి వ్యవహారాలు సర్వసామాన్యం— నీజాగ్రత్తలో నువ్వుంటే సరి...."

"నేనలా సరిపెట్టుకోతల్చుకో లేదు. అంచేతే... వస్తూ... 'రిజిగ్నేషన్' లెటర్ పారేసి మరీ వచ్చాను"

రిజిగ్నేషన్ అనేమాట వినేసరికి మూర్తి మ్రాన్పడి పోయాడు. జవసత్వాలూ వుడిగిపోయినట్టయింది.

"ఎంత తొందరపడ్డావు మాధవీ... ఇన్నాళ్ళూ సాఫీగా సాగిన సంసారం.... ఒడుదుడుకులతో ఇకముందు నా వక్కడి సంపాదనతో ఎట్లా నెట్టుకు వచ్చేట్టూ! —" వాపోయాడు.

అయిపోయింది! అంతా అయిపోయింది. తన ఖర్చుకంటూ ఇకముందు ఒక్క రూపాయికూడా జీతం మిగలదు. కనీసం నెలకొకసారైనా నాలుక తడుపుకుందుకు అవకాశం వుండదు. క్లబ్‌కెళ్ళే వీలుండదు.

పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు.

కసిగా...కోపంగా...నిస్సహాయుడిలా మాధవి ముఖంలో చూశాడు. అశక్తుడిలా తనను తాను తిట్టుకున్నాడు.

రేపనేరోజు తల్చుకుంటుంటే ... తాను భయంతో పాతాళంలోకి కృంగిపోతున్నట్లనిపిస్తోంది.

ఆ రాత్రంతా కంటిమీద కునుకే లేదు.

భార్య సంపాదనతో ఇన్నాళ్ళుగా సుఖపడుతూ వచ్చాడు. విచ్చలవిడిగా ఖర్చుపెట్టేడు.

సంసారంలోనే కాదు ... సంపాదనలో కూడా భార్య తనను సుఖపెడుతోంది. అలాంటి ఆమె మానసికమైన ఆనందం కోసం...ఆహ్లాదం కోసం...ఏనాడూ తాను ప్రయత్నించలేదు.

మాధవి తనకు సరైన శిక్షే విధించింది! అందుకు తనే బాధ్యుడు! భార్యను గౌరవించటం చేతగాని తనకు ఇలాంటి పరాభవం సరైనదే అన్పించింది.

"మాధవీ...ఇన్నాళ్ళూ నిన్ను కష్ట పెట్టినందుకు... నీ మనసు తెల్సుకుని మెలగనందుకూ...నన్ను మన్నించు..."

మూర్తి మాటల్లో సంపూర్ణమైన విశ్వాసాన్ని చూడ గల్గింది మాధవి— అదే కావాలి తనకు!

*　　　　*　　　　*

తొమ్మిది కొట్టేసరికి మూర్తితోపాటు మాధవికూడా బయల్దేరింది.

"నువ్వెక్కడికి !" మూర్తి అడక్కుండ వుండలేక పోయాడు.

"ఆఫీసుకి." ముక్తసరిగా అంది.

"ఆదేమిటీ ? " మూర్తి నోటమాట రాలేదు.

"సారీ సార్ ?... మీతో చిన్న నాటకం ఆడేను. నిన్న మీతో చెప్పిందంతా అబద్ధమే...అందుకు క్షమించండి ..." సిగ్గుతో తలదించుకుంటూ అంది.

"అమ్మదొంగా... నేనే ఓడిపోయాను... నన్నే నువ్వు క్షమించాలి..." అనే భావన మూర్తి ముఖంలోనూ, కళ్ళ లోనూ కన్పించింది — మాధవి వదనంలో తృప్తి తొంగి చూచింది.

— ( 22—12—77 ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితము )

★